


ఆకాశం మొహాన్ని చాటేసింది. నల్లని మబ్బులు ఆక్రమించడంచేత ఆకాశం కాటుక ముద్దలా వుంది. మెల్లగా చెల రేగిన చల్లగాలి తీవ్రరూపాన్ని ధరించింది అంచేత చెట్లు, ఆకూ రెమ్మా ఒకపై దిక్కులేక అల్లాడిపోయే మనిషిలా వూగిపోతున్నాయి.

ఫెళఫెళమని ఎక్కడో ఉరుము గుండెలు పగిలేలా ఉరిమింది దాని వెనకే కత్తిలాంటి మెరుపొకటి క్షణకాలం కళ్ళు పోయేలానూ మెరిపించింది,

ఆ వాతావరణాన్ని చూసి వెంకటేశం

దిగులు పడ్డాడు "ప్రయాణం సరిగా సాగుతుందో లేదో!" నని.

లారీ లోడు చేసుకొని వచ్చింది.

పండగరోజులు కావడంచేత బస్సులకీ, రైళ్ళకీ ఎక్కడా ఖాళీలేదు. ముందే అనుకుంటే ఏ బస్సుకో టిక్కెట్టు రిజర్వు చేసుకొనేవాడు వెంకటేశం.

అనుకోకుండా అన్నయ్య దగ్గరనుంచి ఉత్తరం రావడంతో బయలుదేరాల్సి వచ్చింది

"అమ్మకి ఆరోగ్యం సరిగాలేదు. నిన్ను చూడాలని ఆరాటపడుతోంది కనక వెంటనే బయల్దేరి వస్తావని ఆశిస్తాను" ఉత్తరంలోని సారాంశం అది.

జేబులోంచి ఉత్తరాన్ని తీసి మళ్ళీ ఓ సారి చదువుకొని తిరిగి జేబులో పెట్టుకొన్నాడు వెంకటేశం.

వెంకటేశం సిగరెట్టు ముట్టించాడు. డ్రైవరు లారీకంపెనీ బ్రోకరుదగ్గర రసీదులు, డబ్బు తీసుకుంటున్నాడు.

వాన మొదలైంది. మొదలుపెట్టడమే పెద్ద చినుకులతో ప్రారంభం అయింది వాన.

వెంకటేశం చిరాకుపడ్డాడు. వేరే శలవులేని కారణంగా పండగ కొచ్చిన సెలవుల్ని ఆసరా చేసుకొని బయల్దేరాడు. లేకపోతే ఈ దిక్కుమాలిన వాతావరణంలో బయల్దేరేవాడు కాదు. అద్దెగదిలో ఓ పెగ్గు పుచ్చుకొని ముసుగుతన్ని పడుకొనేవాడు.

"ఎక్కండి బాబూ," క్లీనరు చెప్పాడు. పరుగెత్తుకెళ్ళి ఎక్కేశాడు. లారీ ఆఫీసులోంచి బండి ఎక్కేసరికే తడిసిపోయాడు వెంకటేశం. కర్చీఫ్‌తో మొహాన్ని తుడుచుకొన్నాడు.

"జాగ్రత్తగా పోరా కృష్ణా," చెప్పాడు లారీకంపెనీ బ్రోకరు.

డ్రైవరు నవ్వేసి—"నా సర్వీసులో ఇదో లెక్కాటరా సీతయ్యా." అని బండెక్కి అగరొత్తులు వెలిగించి దేవుడికి దణ్ణం పెట్టుకొని బండి స్టార్టుచేశాడు. లేలెండు లారీ పెనుగాలితో కూడిన వర్షంలో భూతంలా అరుస్తూ కదిలింది.

ఓ పక్క క్లీనరు, రెండోవైపున డ్రైవరు మధ్యగా కూర్చున్నాడు వెంకటేశం.

వర్షం జల్లు లోపలికి కొట్టకుండా అటు ఇటు పట్టాలు దింపేశాడు క్లీనరు. టక్ టక్‌మని శబ్దంచేస్తూ విండోస్క్రీన్ పైన వైపర్స్ అటూ ఇటూ కదులుతున్నాయి. రోడ్డుపైన పారుతోన్న నీళ్ళని సర్రున కోసుకొంటూ లారీ రోడ్డుపైన జారుతోంది.


కరెంట్ ఆఫ్ అయినట్టుంది. రోడ్డు కూడా చీకటిగా వుంది లారీ హెడ్‌లైట్ల కాంతి రోడ్డుపైన పారుతోన్న నీళ్ళపైన పడుతోంది.

వెంకటేశానికిలా లారీలో ప్రయాణం కొత్తేమీ కాదు ఒకసారిలాగే ప్రయాణం చేసినందుకు అతన్ని తండ్రి చాలామందలించాడు.

తండ్రి గుర్తురాగానే అతనికి ఏడుపొచ్చింది

ఈ లోకంలో ఒంటరిగా విసిరేయబడిన ఓ అనామకుడిగా అనిపించి మనసు విలవిల్లాడిపోయిందతనికి.

వెంకటేశం అంటే అతనికి తండ్రికి




వల్లమాలిన ఇష్టం. ఆయన వున్నాడన్న ఓ మొండి ధైర్యం అతనికుండేది. వెంకటేశం మధ్య తరగతికి చెందిన వాడే అయినా, అతనికి ఏవిధమైన లోటునీ తెలీనీలేదు అతని తండ్రి చౌదరి.

వెంకటేశాన్ని లాయర్ని చెయ్యాలని చౌదరి కోరిక. ఆ కోరికతో అనేకమైన కలలు కన్నాడాయన తండ్రి కోరిక తెలిపిన చిన్నన్నయ్య నారాయణ నవ్వి అనేవాడు.

"నువ్వెప్పుడో జడ్జీవై పోతావురా. అప్పుడు నీ చేతికింద పని చెయ్యాల్సి వస్తుంది," అని

నారాయణ కోర్టులో బెంచిగుమస్తాగా పని చేసేవాడు. చిన్నన్నయ్య ఆ కారణంగా ధనుర్వాతానికి గురై చచ్చిపోయాడు. వెంకటేశం అంటే నారాయణకి చాలా ఇష్టం. కాలేజీ శలవుల్లో వచ్చి వెంట తీసుకెళ్ళి బట్టలవీ కొనిచ్చేవాడు చిన్నన్నయ్య పనిచేసిన నందిగామ నూజివీడు వెంకటేశం రెండు సార్లు వెళ్ళాడు. చేసింది చిన్న ఉద్యోగమే అయినా చాలా పలుకుబడిని పెంచుకొన్న మనిషి నారాయణ.

వెంకటేశం తండ్రి కలల్ని నిజం చేయబోయిన తరుణంలో ఆయన వెంకటేశాన్ని మోసంచేసి, ఈ ప్రపంచంలో వున్న అన్ని బంధాల్నుంచి విముక్తిపొంది పారిపోయాడు. దాంతో అతన్ని ఎవరూ సరిగా గైడ్ చేయని కారణంగా హైదరాబాదులో వుంటున్నాడు పత్రికారచయితగా స్థిరపడ్డాడు.

లారీ కీచుమని శబ్దంచేస్తూ ఆగింది. వెంకటేశం ఈ లోకంలో పడ్డాడు.

వర్షం కురుస్తూనే వుంది. క్లీనరు ఏదో

రశీదు పుస్తకం తీసుకొని లారీలోంచి దూకి పాకలావున్న ఏదో ఆఫీసులోకి వెళ్ళాడు. అది చెక్‌పోస్టు. డ్రైవరు సిగరెట్ వెలిగించి వెంకటేశంకేసి చూశాడు. సరిగా అదే సమయంలో డ్రైవర్ని పలకరించారు. వెంకటేశం కూడా తలతిప్పి చూశాడు.

"పది గంపలు, నలుగురు మనుషులున్నారు. తీసుకెళతావా?"

"వర్షం కురుస్తుంటే ఎక్కడెక్కుతారు?" డ్రైవర్ అడిగాడు

"లేబరే. వాళ్ళు వానలో తడుస్తూ కూర్చోగలరు "

"ఎంతిస్తారేమిటి?"

"మనిషికైదు రూపాయలు నంది గామ దిగుతారు."

"మనిషికి పదిమ్మను."

"అన్యాయం గురూ!"

"నీకేరా సన్నాసి, చెప్పడంకాదు. ఎవడన్నా పట్టుకుంటే నా లైసెన్సు ఊడుతుంది."

క్లీనరొచ్చేశాడు.

లారీ తిరిగి కదిలింది.

వెంకటేశం మాట్లాడకుండా రోడ్డుకేసి చూస్తున్నాడు.

నల్లని రోడ్డుపైన వర్షం కురుస్తోంది.

"బండి సరిగా పోద్దంటావురా నర్సిగా?"

"నీ కిదో లెక్కా గురూ, స్పీడెక్కించు."

"వర్షం ఎక్కువగా వుంది. మెల్లగా వెళితేనే మంచిది," అన్నాడు వెంకటేశం.

క్లీనరు నవ్వి—

"మా గురువు డ్రైవింగ్ ఇలాటప్పుడే సూడాలసలు," అన్నాడు.

వెంకటేశం మరో సిగరెట్ తీసి వెలిగించాడు.

లారీ కిటికీలకి పట్టాలు దింపినా సందుల్లోంచి వాన జల్లుతోపాటుగా చలిగాలి కొడుతోంది.

జర్రున జారుతూ, మెలికలు తిరుగుతూ వెళుతోంది లారీ

ఏదో లారీ ఎదురుగా వచ్చి దూసుకుపోయింది

"ఎవడ్రాఆడు బొత్తిగా నూకలున్నట్టు లేదు "

"ఎ డి టి 45467 గురు. కోటీశ్వరావు బండి "

"నాయాల్ది అడనితెలిస్తే ఓ గుసాయం పిచ్చేవోడ్ని."

"గురూ, నీకు తెలుసా—ఆడి పెళ్లాం లేచిపోయింది."

"కోటిగాడి పెళ్లావేనా?"

"అవును! కోటీశ్వరావు బండిమీదుండేవాడే రాములుగాడు. ఆడితో చెక్కేసిందిట."

"ఓనర్నొదిలి లారీ తోలేవాడ్ని పట్టందన్నమాట" డ్రైవరు నవ్వాడు

"డబ్బుంటే సరేటి గురూ, ఎప్పుడూ తాగి తొంగుంటాడు. పిల్లాపాపా లేరు. దానికీ యిసుగెత్తి పోయుంటది."

వర్షం తగ్గలేదు. మెరుపు జిగేలుమని కళ్ళుపోయేలా మెరిసింది అటుపైన గంటన్నరపైగా ప్రయాణం సాగింది. చౌట

ప్పల్ దగ్గర ఓ పాకముందు లారీ ఆపేడు డ్రైవర్ కృష్ణ

"భోజనం చేశారా?" అడిగేడు వెంకటేశాన్ని.

"లేదు." అన్నాడు

"పదండయితే?"

అక్కడింకా చాలా లారీలున్నాయి. డ్రైవర్లు, క్లీనర్లు కూర్చున్నారు

అలాంటి చోటులో ఈ లారీలోళ్ళ కోసమే ఈ హోటళ్ళు ప్రత్యేకంగా పెట్టారు.

చెక్క బల్లపైన కూర్చున్నాడు వెంకటేశం.

"ఏముంది?" అడుగుతున్నాడు కృష్ణ.

"మటన్ కుర్మా, చపాతీ, రైస్ "

"నాకు చపాతీ కుర్మా చాలు " చెప్పాడు వెంకటేశం.

"ఏంగురూ!"

కొత్త గొంతు తలెత్తి చూశాడు వెంకటేశం కృష్ణని భుజం తడుతున్నాడు ఎవడో అతనూ డ్రైవర్లానే వున్నాడు?

"ఏవూరేటి లోడు "

"ఏలూరు "

"ఇబ్రహీం పట్నం దగ్గర ఏరుపొంగేలా వుంది. జాగ్రత్తగా ఎల్లు "

కృష్ణ మాట్లాడేడు

ఇంకెవడో అంటున్నాడు.

"కార్లు మేడలు వున్నాయని విర్రవీగుతారు కానీ, ఆఖరికి అర్ధాంతరంగా వస్తార్రా. కంచికర్ల దగ్గర ఫియట్ కారొకటి పచ్చడి పచ్చడయింది."

"ఏక్సిడెంట్ లా అయింది."

"ఎవరో డాక్టరుదట బండి. పెళ్ళి కెళ్ళి వస్తున్నాడన్నారు. నిద్ర కునుకొచ్చి చెట్టుకి గుద్దేశాడు. అంతే! హరీమన్నాడు."

"పాపం."

"అదే వాడొచ్చి ఏలారీకో గుద్దేడనుకో. జనం ఏమంటార్రా? లారీ డ్రైవర్లు తాగుబోతు వెధవలు, వళ్ళు తెలీదు వెధవలకి అంటారు."

మాటలన్నీ వింటూ నవ్వుతున్నాడు వెంకటేశం.

భోజనం అయింది పక్కనే వున్న చిన్న పాన్ షాపులో పాన్ కొనుక్కుని వేసుకున్నాడు వెంకటేశం. ముగ్గురికి ఏడున్నరయింది? వెంకటేశమే డబ్బులిచ్చేశాడు.

లారీ తిరిగి కదిలింది. టైం చూశాడు వెంకటేశం

పన్నెండు దాటుతోంది.

"బెజవాడకి చేరేసరికి ఆరవుద్దా?" అడిగాడు

"వాతావరణం సరిగ్గుంటే మూడు గంటల్లో తీసుకెళ్ళేవోడు కృష్ణ." క్లీనరన్నాడు.

"నేనడిగింది ఆరుగంటలకి చేరుతుందా అని "

"ఆ చేరుద్ది "

వెంకటేశాని కసలు ప్రయాణాలంటే తలనొప్పి. సిటీలో కూడా ఎక్కువగా రిక్షాలు, ఆటోలేగానీ, జనంలోపడి బస్సెక్కడు. అతనికి చిరాకు.

వెంకటేశానికి జయ గుర్తుకొచ్చింది.

జయ ఏంజిల్లా వుంటుంది, సన్నగా తీగలా నాజుగ్గా, కోమలంగా అదోలా

ఇంకేదోలా, మతిపోయేలా వుంటుంది. బొడ్డుకి కిందగా కట్టిన పల్చని సిల్కు చీర, స్లీవ్‌లెస్ బ్లౌజు, కాళ్ళకి హీల్స్, జడ అల్లకుండా వదిలేసిన అందమైన పొడుగాటి కురులు. కోలమొహం, లేత చెక్కిళ్ళు. గడ్డానికి కుడివైపు చిన్న పుట్టు మచ్చ. ఎత్తైన గుండెలు, తెల్లని భుజాలు. చీర కుచ్చెళ్ళకీ, జాకెట్ కీ మధ్య అందంగా తెల్లగా మెరిసిపోతూ కనిపించే పొట్ట. జయ అనగానే వెంకటేశానికి గుర్తు కొచ్చే రూపం అది.

ఊరొచ్చే ముందు అడిగింది జయ

"మళ్ళా ఎప్పుడొస్తావ్?"

"వారం లోపల."

"అదేం కుదరు. మూడు రోజుల్లో తిరిగిరాకపోతే నేనసలు నీతో మాట్లా డను," అంది.

"నువ్వు మాట్లాడకపోయినా నేను మాట్లాడతాను."

"నువ్విలాగే అంటూవుండు. నే నెప్పుడో నిన్నొదిలి పారిపోతాను."

"నువ్వు పారిపోలేవు"

"ఏమిటి నమ్మకం."

"నా మనసులో నిన్నెప్పుడో బంధిం చాను"

"డోన్టాక్ రబ్బిష్."

"రెడ్డి ఏమంటున్నాడు?" అడిగాడు వెంకటేశం.

"నన్ను ప్రేమిస్తున్నాడట"

"నువ్వేమన్నావ్."

"యు ఆర్ ఎ ఫూల్, అన్నాను."

"గుడ్ నాతోనూ చెప్పాడు నీగురించీ తనగురించీ కలిపి ఓకథ రాయమన్నాడు."

"నువ్వేమన్నావ్?"

"అలాగే అన్నాను."

"రాస్తావన్నమాట?"

"నీగురించి కథ తప్పకుండా రాస్తాను. మాటల్లోకంటే కాగితంపైన నా మనసుని పూర్తిగా నీముందు వుంచగలను కనక."

"ఏమని రాస్తావ్?"

"నువ్వే నా ప్రాణమని"

"నేను నీ ప్రాణాన్నికాదు. నువ్వే నా ప్రాణానివి," అంది అతని చుట్టూ చేతులు వేస్తూ తిరిగి అడిగింది

"కథ పేరేం పెడ్తావ్?"

"జయా, మై డార్లింగ్," అన్నాడు. అంటూనే "నేనంటే నీ కెందుకంత యిష్టం," అడిగాడు.

"నీ దగ్గర నాక్కావల్సింది దొరుకు తుందన్న ఆశ" అంది.

"అంతేనా?" అంటూ వెంకటేశం జయ పెదవుల్ని అందుకున్నాడు

"ఇది మొదటి ముద్దు జయా" అన్నాడు వెంకటేశం

"చాలా తియ్యగావుంది ఇదెప్పుడూ మర్చిపోను." అంది జయ, వెంకటేశం కళ్ళల్లోకి చూస్తూ.

"ఇంకెంతకాలం ఆగాలి?" అడిగేడు.

"దేనికి?"

"పూర్తిగా నిన్ను స్వాధీనం చేసుకో డానికి"

"ఇప్పుడు మాత్రం నీకేం అడ్డు."

"అదికాదు నేనడిగింది. మన పెళ్ళెప్పు డని."

"నాన్సెన్స్? నాకు పెళ్ళిళ్ళ పైన నమ్మకం లేదు"

"మరి?"

"మూఢాచారాల పైన నాకు నమ్మకం




లేదు. నా కిష్టమైన వాడితో కలిసి జీవించడమే పెళ్ళికింద లెక్క. ముక్కు మొహం తెలీని ఎవడ్నో తెచ్చి శాస్త్రోక్తంగా పెళ్ళి చేసుకొనేకంటే ఓ మనిషిని పూర్తిగా అర్థంచేసుకొని వాడితో కలిసి జీవించడమే పెళ్ళికింద లెక్క. నీకు నేను కావాలి నాకు నువ్వు కావాలి బస్ అంతే నలుగురు ఫ్రెండ్స్‌ని పిలిచి కొకాకోలా ఇచ్చి ఆ రోజునుంచి మనం కలిసి జీవిస్తున్నామని చెప్పేస్తాం," అంది

జయ భావాలకి వెంకటేశం అచ్చెరువందేడు నిజానికి వెంకటేశానిక్కూడా మూఢాచారాలపైన అంతగా నమ్మకం లేదు మనసులో లేంది కౌగలించుకొంటే వస్తుందా అన్న సిద్ధాంతం అతనిది

లారీ కీచుమని శబ్దంచేస్తూ ఆగింది

"ఏంటిరా?" అడిగాడు డ్రైవరు

"టైర్లో రాయి ఇరుక్కున్నట్టుంది గురూ!" అన్నాడు

"దిగిచూడు"

క్లీనరు నర్శియ టార్చి పుచ్చుకొని దిగాడు లారీ చుట్టూ తిరిగి చిన్న రాయి పట్టుకొచ్చాడు

"రాయే గురూ," అన్నాడు తర్వాత పాత గుడ్డతో విండ్ స్క్రీన్ తుడిచి లోపల కెక్కాడు

వెంకటేశానికి ఆశ్చర్యం కలిగింది వెళుతోన్న లారీలో కూర్చొన్న మనిషికి టైర్లో రాయి ముక్క దిగబడితే ఎలా తెలిసిందో? అదే అడిగితే క్లీనరు నవ్వి,

"రాయి ముక్కే నవొదిలేస్తే టైరు బరస్టవుద్ది ఇదంతా అనుభవంతో తెలుస్తది."

సూర్యాపేటకి దగ్గర దగ్గర వెళుతోంది. వాన జోరు తగ్గింది కానీ గాలి వాటు తగ్గలేదు.

మధ్య మధ్య మెరుపులు కత్తుల్లా మెరుస్తున్నాయి. రోడ్డుపైన నీరు వరదలా గారుతోంది. లారీ వెళుతోంది నీళ్ళని సీసుకుంటూ. రోడ్డు పక్క గోతులోకి ౹గిపోయిన ఓ లారీని చూసి "ఎవడిదో ౹ండి దిగడిందిరోయ్," అన్నాడు కృష్ణ.

వెంకటేశం ఆలోచిస్తున్నాడు.

"అమ్మ కెలావుందో? ఈ లోకంలో తల్లితండ్రుల్ని మించిన మనుషులెవ్వరూ వుండరు. సాధారణంగా వాళ్ళున్నప్పుడు వాళ్ల విలువతెలీదు. వెంకటేశానికి ప్రత్యక్షానుభవం అది. తండ్రిపోయిన తర్వాత గాని తెలిసిరాలేదు. ఇప్పుడు అమ్మే తనకి సర్వస్వం. ఆమెని దేవుడు కాపాడాలని మనసారా కోరుకొన్నాడు. తల్లికి ఏమన్నా జరిగితే అతను భరించలేడు.

వెంకటేశానికి పెద్ద అనుమానం. తన తండ్రి చనిపోలేదని. ఎక్కడో ఆయన వున్నాడని. తిరిగి తను ఆయన్ని చూడగలనని. జరిగిందంతా ఓ కలని అనుమానం అతనికి.

లారీ హారన్ గట్టిగా మోగింది. నిద్ర ముంచుకొస్తోంది. లేలెండు లారీలో చిన్న సుఖం వుంది. డ్రైవరు వెనకగా పొడుగుపాటి సీటు వుంటుంది. ఓ మనిషి పడుకోటానికి వీలుగా వుంటుంది.

వెంకటేశం మెల్లగా ఆ సీటులోకి మారి పడుకొన్నాడు. అతని కళ్ళ పైకి నిద్ర ముంచుకొచ్చింది.

* * *

వెంకటేశం ఆశ్చర్యపోయాడు. అతనికి ఇల్లు మూర్తీభవించిన శోకంలా కనబడింది. గుండె దడదడ లాడింది. అదురుతోన్న గుండెతో ఇంట్లో అడుగుపెట్టాడు వెంకటేశం.

అమ్మ ఏడ్చి ఏడ్చి నీరసంగా పడుకొనివుంది. అన్నయ్యతో ఎవరో చాలా మంగి మాట్లాడుతున్నారు. అక్కయ్య మూల కూర్చుని ఏడుస్తోంది.

ఏమయింది?

వెంకటేశం పరుగెత్తికెళ్ళి తల్లి పక్కలో కూర్చుని కుదిపేస్తూ

"అమ్మా నే నొచ్చేశాను. నీ కెలా వుంది? చూడమ్మా." అన్నాడు. తల్లి కదల్లేదు. అతని మాటలు వినిపించుకోలేదు. తన్నెవరూ చూడ్డంలేదు.

అక్క దగ్గరికి నడిచి పిలిచాడు.

"అక్కా, ఏమిటే, మీరంతా ఎందుకిలా వున్నారు. నామీద కోపమా?"

అతని అక్క శూన్యంలోకి చూస్తోంది. కనీసం తలకూడ తిప్పిచూడలేదు.

అన్నగారు మాట్లాడుతోన్న వేపుకి వెళ్లాడు.

ప్లీడరుగారు, అన్నయ్య ఫ్రెండ్ సాంబయ్య, సూరిగాడు, కరణం . వీళ్ళెవరూ తనని పలకరించలేదు

"అన్నయ్యా." అని పిలిచాడు.

అన్నయ్య మాట్లాడలేదు.


వూర్నుంచి వచ్చినవాడ్ని కనీసం పరామర్శకి కూడ వీళ్ళు పలకరించడంలేదు. అదే నాన్నవుంటే వీళ్ళంతా ఇంత నిరాదరణ చూపేవారా?

బహుశ వీళ్ళకి జయ సంగతి తెలిసివుండాలి. దాంతో కోపం వచ్చివుంటుంది.

జయ సంగతి వీళ్ళకేం తెలుసు?

స్ట్రీట్ గర్ల్ జయ.

రమ్మని రాసినందుకు, కష్టబడి వచ్చినందుకు తగిన మర్యాద చేశారు.




చాలు అనుకొన్నాడు వెంకటేశం. అక్కడో క్షణంకూడ వుండ బుద్ధికాలేదు

వెంకటేశం లేచి నించున్నాడు

అదేమిటి నాన్నగారు నాన్నగా రొచ్చారు చిరునవ్వుతో తనని పిలుస్తు న్నారు నిజమే తనను కొన్నదే నిజం. నాన్నగారు చనిపోలేదు అదంతా ఓ కల.

కానీ ఇంట్లో నాన్నగారి ఫొటోకి వాడి పోయిన పూలదండ వుంది

పోలీసు కానిస్టేబుల్ తన బ్రీఫ్ కేస్ తీసుకొస్తున్నాడు

వెంకటేశం అది లారీలో మర్చి పోయాడు కొంపతీసి దానిలో స్మగ్లింగ్ గూడ్స్ లేవుకదా!

పోలీసంటున్నాడు

"లారీ ఏక్సిడెంట్ అయిన చోట దొరి కింది బాబు ఇది మీ తమ్ముడుగారిదట"

"లారీ ఏక్సిడెంటా? అయితే తనెలా వచ్చినట్టు!"

"శవాన్ని మధ్యాన్నం ఇచ్చేస్తారు!" చెప్పి వెళ్తున్నాడు పోలీసు బ్రీఫ్ కేస్ లోంచి వెంకటేశం బట్టల్ని తీసి చూపి అక్కయ్య ఏడుస్తోంది వెంకటేశానికి అయోమయంగా వుంది తండ్రికేసి చూశాడు

తండ్రి చేతులు చాచాడు

"పదబాబూ పద, నువ్వు నా దగ్గర కొచ్చేశావు"

వెంకటేశానికి అర్థం అయింది తనం దరికీ దూరం అయిపోయాడు

"జయా! జయా! పిచ్చి జయ! నిన్ను మోసం చేసి వెళ్ళిపోతున్నాను నన్ను క్షమించు." తనకోసం ఎదురుచూస్తూ వుంటుంది జయ వెంకటేశానికి ఏడు పొచ్చింది. "గుడ్ బై జయా!" అను కున్నాడు

వెంకటేశం బావురుమంటూ తండ్రి గుండెలపైన వాలిపోయాడు □